సాక్షి
ఖమ్మం
మంగళవారం । 18 । జూన్ । 2024



రూ.లక్షల్లో కొల్లగొడుతున్నారు..
సైబర్ నేరగాళ్లు తమ మాయమాటలతో నమ్మిస్తూ పలువురి ఖాతాల నుంచి రూ.లక్షల్లో నగదు కొల్లగొడుతున్నారు. 8లో



వంతెనను కమ్మేసిన పొగ
వైరా మండలం స్టేజీ పినపాకలోని హైలెవల్ వంతెన వద్ద చెత్తకు నిప్పంటుకుని పొగ కమ్ముకోగా వాహనదారులు అవస్థ పడ్డారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 26°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక



అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

మధిర: మధిర నియోజకవర్గంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా సమీప గ్రామస్తులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించినట్లు మధిర రేంజ్ అటవీ శాఖ అధికారి విజయలక్ష్మి తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఎర్రుపాలెం మండలంలో ఉన్న ఇనిద్రమ్మ చెరువు, జమలాపురం ఆలయ సమీపాన అర్బన్ పార్క్ తదితర ప్రాంతాలను పరిశీలించినట్లు ఆమె వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో పెరుగుతున్న మొక్కలు, నీటి లభ్యత తదితర అంశాలతో నివేదికను జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఖమ్మం డివిజన్ అధికారి మంజులతో కలిసి సోమవారం ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందజేసినట్లు తెలిపారు.

నేడు రైతుల ఖాతాల్లోకి 'పీఎం సమ్మాన్'

- జిల్లాలో 1.70 లక్షల మందికి పెట్టుబడి సాయం

ఖమ్మంవ్యవసాయం: పంటల పెట్టుబడి కోసం కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకం ద్వారా మంగళవారం రైతుల ఖాతాల్లో నగదు జమ కానుంది. మంగళవారం సాయంత్రం 5గంటలకు రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే ప్రక్రియను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాన్ని రైతులు ప్రత్యక్షంగా వీక్షించేలా వైరా కేవీకే తదితర ప్రాంతాల్లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పంటల సాగు కోసం చిన్న, సన్నకారు రైతులకు చేయూతనిచ్చేలా కేంద్రప్రభుత్వం 2019 ఫిబ్రవరిలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు విడతల్లో రూ.2వేల చొప్పున రూ.6వేలను ఐదేళ్లుగా అందిస్తోంది. జిల్లాలో ఈ పథకం ద్వారా 1.70 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా, వీరికి ఇప్పుడు రూ.2 వేల చొప్పున రూ.34 కోట్లు జమ కానున్నాయి. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యాన రైతులకు ఈ నగదు పెట్టుబడికి ఉపయోగపడనుంది.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని హకీంపేటతో పాటు ఆదిలాబాద్, కరీంనగర్‌లోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యాన మూడంచెల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు మండల స్థాయిలో, 28 నుంచి 29 వరకు జిల్లా స్థాయిలో, ఆతర్వాత జూలై 8నుంచి 12వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 1-9-2015 నుండి 31-08-2016 మధ్య జన్మించిన విద్యార్థులకు పోటీలకు హాజరయ్యేందుకు అర్హులని తెలిపారు. ఎత్తు, బరువుతో పాటు 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800మీటర్ల పరుగు, షటిల్ రన్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, మెడిసిన్ బాల్‌త్రో, వైద్యపరీక్షలు నిర్వహించి అర్హత సాధించిన వారికి స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పిస్తామని డీవైఎస్‌ఓ వెల్లడించారు.

20న పండితాపురం సంత వేలం



పండితాపురం సంత ముఖద్వారం

కామేపల్లి: పశువుల క్రయవిక్రయాలకు రాష్ట్రంలోనే పేరున్న మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామపంచాయతీ పరిధి శ్రీ కృష్ణ ప్రసాద్ పశువుల వారాంతపు సంత బహిరంగ వేలం ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నారు. సంత ఆవరణంలో వేలం జరుగుతుందని ఎంపీడీఓ రవీందర్ తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 31వరకు కాల పరిమితితో నిర్వహించే వేలంలో పీసా చట్టం ప్రకారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. రూ.30లక్షల ధరావతు, రూ.5లక్షల సాల్వెన్సీని డీడీ లేదా నగదు రూపంలో చెల్లించి పాల్గొనాలని సూచించారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం సంత నిర్వహణ గడువు ముగిశాక మార్చి 11న వేలం నిర్వహించినా ప్రభుత్వ మద్దతు ధర రాకపోవడంతో అదేనెల 17వ తేదీకి వాయిదా వేశారు. అంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అప్పటినుంచి గ్రామపంచాయతీ ఆధ్వర్యాన సంత నిర్వహిస్తున్నారు.

'ఉపాధి' దండిగా...

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంత కూలీలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తోంది. వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు వంద రోజుల పాటు పని కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని కేంద్రప్రభుత్వం అమలుచేస్తోంది. తద్వారా వ్యవసాయ కూలీలకు స్వస్థలాల్లో ఉపాధి లభిస్తుండడంతో వలసలు తగ్గాయి. ఏటా ఎండాకాలం వ్యవసాయ సీజన్ ముగియగానే ఈ పనులపై కూలీలు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 56.60 లక్షల పనిదినాలు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా.. ఇప్పటికే 49.17 లక్షల పనిదినాలు పూర్తి కావడం విశేషం. ఇంకా వానలు జోరందుకోని నేపథ్యాన వ్యవసాయ పనులు అందుబాటులోకి వచ్చే వరకు కూలీలు ఉపాధి పనులనే ఎంచుకునే అవకాశముంది.

గ్రామీణ ప్రాంత కూలీలకు కాదనకుండా పని
- ఈ ఏడాది 56.60 లక్షల పనిదినాల లక్ష్యం
- ఇప్పటికే 49.17 లక్షల పనిదినాలు పూర్తి!
- వ్యవసాయ పనులు జోరందుకునే వరకు ఇదే పరిస్థితి



ఎర్రుపాలెం మండలం మీనవోలులో రోడ్డు నిర్మాణంలో పాల్గొన్న ఉపాధి కూలీలు (ఫైల్)

పండుగలా పనులు

గడిచిన యాసంగిలో నీటి లభ్యత లేక పంటల సాగు నామమాత్రంగా జరిగింది. దీంతో ఎండాకాలం రాకముందే వ్యవసాయ పనులు ముగిశాయి. ఈ నేపథ్యాన ఆర్థిక సంవత్సరం మొదటి నుంచే కూలీలు ఉపాధి పనుల వైపు మొగ్గు చూపారు. కూలీల ఆసక్తి మేరకు పనులు కల్పించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ ఏడాది జిల్లాలోని చెరువులన్నీ దాదాపు ఎండిపోవడంతో ఉపాధి కూలీలతో పూడిక తీయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫలితంగా కూలీలకు కావాల్సినంత పని లభించగా.. నెల పాటు రోజుకు 80 వేల నుంచి లక్ష మందికి పైగా కూలీలు హాజరయ్యారు. జిల్లాలో ఏ గ్రామంలో చూసినా చెరువులు, ఉపాధి పని ప్రదేశాలు జాతరను తలపించిన నేపథ్యాన వందలాది మంది కూలీలు రావడంతో పనులు వేగంగా పూర్తయ్యాయి.

సౌకర్యాల కల్పన

ఉపాధి పనులకు పెద్ద సంఖ్యలో వస్తుండడం.. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉండడంతో జిల్లా యంత్రాంగం పని ప్రదేశాల్లో కావాల్సిన సౌకర్యాలు కల్పించింది. పంచాయతీ కార్యదర్శులు పని ప్రదేశాల్లో కూలీలకు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయడమే కాక తాగునీటిని సమకూర్చారు. అలాగే, వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇవ్వడంతో కూలీలు మండుటెండల్లోనూ పనులు చేసేందుకు ముందుకొచ్చారు.

49.17 లక్షల పనిదినాలు పూర్తి

కేంద్రప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి మించి రాష్ట్రప్రభుత్వం జిల్లాకు 56.60 లక్షల పనిదినాలను మంజూరు చేసింది. ఈ పనిదినాలను ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31లోగా పూర్తి చేయాల్సి ఉంది. అయితే, యాసంగిలో సాగర్ జలాలు లేక జిల్లాలో వ్యవసాయ పనులు మందగించడం.. కూలీలంతా ఉపాధి హామీ పథకం వైపు మొగ్గు చూపడంతో ఈ ఏడాది ఏప్రిల్ 1నుంచి జూన్ 17 వరకు జిల్లాలో 49.17 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. మునుపెన్నడూ లేని విధంగా ఆర్థిక సంవత్సరం తొలినాళ్లలోనే ఈ స్థాయిలో పనిదినాలను పూర్తి చేయడం రికార్డుగా చెబుతున్నారు. ఏటా వ్యవసాయ పనులు మొదలయ్యే నాటికి 20 లక్షల నుంచి 30 లక్షల పనిదినాలు మాత్రమే పూర్తవుతుండగా.. ఈసారి 50 లక్షల పనిదినాలు దాటుతాయని అంచనా వేస్తున్నారు.

వంద రోజులు పూర్తి

ఏడాదిలో ఒక్కో కుటుంబానికి వంద రోజుల మేర పని కల్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తారు. ఇలా వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు ఆర్థికంగా కలిసొస్తుండగా.. ఆపై వారి పిల్లలకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ కూడా ఇస్తారు. అయితే, లక్ష్యాన్ని పూర్తిచేసే వారు జిల్లాలో ఏటా పదుల సంఖ్యలో ఉంటుండగా.. ఈసారి ఇప్పటికే 138 కుటుంబాలకు చేరింది. ఈ కుటుంబాల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముందని చెబుతున్నారు.

సరిపడా ఉపాధి చూపారు...



ఈ ఏడాది మాకు సరిపడా ఉపాధి పనులు చూపించారు. వంద రోజులపాటు పని దొరికింది. యాసంగిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఇబ్బంది పడ్డాం. దీంతో ఉపాధి హామీ పనులు మాలాంటి కుటుంబాలను ఆదుకున్నాయి. కుటుంబానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆదుకున్నట్లయింది.

– నాగమ్మ, భైరవునిపల్లి, నేలకొండపల్లి మండలం

జిల్లాలో ఉపాధి హామీ పథకం వివరాలు..

56.60 లక్షలు	49.17 లక్షలు	1.43 లక్షలు	2.27 లక్షలు	138	రూ.113.33 కోట్లు	రూ.105.87 కోట్లు
ఈ ఏడాది పనిదినాల లక్ష్యం	ఇప్పటి వరకు పూర్తయినవి	పనిచేసిన కుటుంబాలు	పనికి వచ్చిన కూలీలు	వంద రోజులు పూర్తిచేసిన కుటుంబాలు	ఇప్పటి వరకు అయిన వ్యయం	ఇందులో కూలీల వేతనాలు

విద్యుత్ ప్రజావాణి ప్రారంభం

- సమస్యలను విన్నవించిన వినియోగదారులు
- ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని అధికారుల వెల్లడి



ఖమ్మంలో ఎస్‌ఈ సురేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న మమతారోడ్డు వాసులు

ఖమ్మంవ్యవసాయం: కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్ తరహాలో విద్యుత్ శాఖలోనూ ప్రజావాణి ప్రారంభమైంది. జిల్లాలోని 45 సెక్షన్లు, 12 సబ్ డివిజన్లు, నాలుగు డివిజన్లు, తొమ్మిది ఈఆర్‌ఓ కార్యాలయాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయా విభాగాల అధికారులు వినియోగదారుల నుంచి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యల పరిష్కారంపై అక్కడికక్కడే సిబ్బందికి సూచనలు చేశారు. ఇక సాయంత్రం 3నుంచి 5 గంటల వరకు జిల్లా కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా ఎస్‌ఈ ఏ.సురేందర్ పాల్గొన్నారు. కూసుమంచికి చెందిన రైతు డి.వెంకటేశ్వరరావు విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యపై, ఖమ్మం మమతా రోడ్డులో విద్యుత్ స్తంభం సమస్యపై వి.పద్మజ, కవిరాజ్‌నగర్‌లో నిర్మించిన అపార్ట్‌మెంట్‌కు విద్యుత్ మీటర్ల ఏర్పాటుపై సీహెచ్.ప్రసన్న తదితరులు దరఖాస్తులు సమర్పించారు. అలాగే, ఖమ్మం డివిజన్ కార్యాలయంలో 17 ఫిర్యాదులు అందాయని డీఈఈ నంబూరి రామారావు తెలిపారు. ఇక సత్తుపల్లి, వైరా, ఖమ్మం రూరల్ డివిజన్ల పరిధిలో ప్రధానంగా వ్యవసాయ కనెక్షన్లు, గృహజ్యోతి తదితర అంశాలపై దరఖాస్తు చేసుకున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు

వినియోగదారుల నుంచి అందిన దరఖాస్తులను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అందిన దరఖాస్తులు, ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను ఎస్‌ఈ సురేందర్ పర్యవేక్షిస్తుండగా ఎప్పటికప్పుడు ప్రత్యేక సెల్‌కు చేరనున్నాయి. తద్వారా ఉన్నతాధికారులు పరిశీలించి పరిష్కారంపై దిశానిర్దేశం చేయనున్నారు. ఈసందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కాగా, తొలివారం తక్కువగా దరఖాస్తులు, ఫిర్యాదులు అందినా రానున్న కాలంలో ఈ సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

జిల్లావ్యాప్తంగా ఈద్గాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



బక్రీద్ పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఇళ్లలో ప్రార్థన చేసిన అనంతరం ఈద్గాల్లో జరిగిన సామూహిక ప్రార్థనలకు హాజరయ్యారు. అక్కడ మతపెద్దలు బక్రీద్ పర్వదినం ప్రత్యేకత, విశిష్టతలను వివరించారు. ఆతర్వాత పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుని ఇళ్లకు చేరారు. అనంతరం ముస్లింలు తమ స్థోమతకు అనుగుణంగా స్నేహితులు, బంధువులకు ఖుర్బానీతో పాటు తీపి వంటకాలను అందజేశారు.

- మరికొన్ని ఫొటోలు 9లో..



ఖమ్మంలోని గొల్లగూడెం ఈద్గాలో ప్రార్థనకు హాజరైన ముస్లింలు

రామాలయంలో సుదర్శన హోమం

స్వామివారికి ముత్తంగి అలంకరణ



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో సోమవారం చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. కాగా సోమవారాన్ని పురస్కరించుకుని స్వామివారిని ముత్తంగి రూపంలో అలంకరించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సెలవు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన 107 జంటలు ఈ వేడుకలో పాల్గొన్నాయి.

మధిరకు మహర్దశ

- మురుగు సమస్య నుంచి విముక్తికి ప్రణాళిక
- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.128 కోట్ల నిధులు
- పట్టణానికి రెండువైపులా డంపింగ్ యార్డుల నిర్మాణం
- ఆపై అన్ని రహదారులు సీసీగా అప్‌గ్రేడ్
- డిప్యూటీ సీఎం భట్టి చొరవతో మారనున్న రూపురేఖలు

మధిర: గట్టిగా ఓ వర్షం పడితే రహదారులపైకి చేరుతున్న వరద.. పట్టణానికి దూరంగా డంప్ యార్డ్ ఉండడంతో అక్కడకు చెత్త చేర్చలేక వదిలేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతున్న వీధులు.. దీనికి తోడు చాలా కాలనీలకు కార్మికులు వెళ్లక వీధుల చివర చెత్త వేస్తుండడంతో పేరుకుపోతున్న వ్యర్థాలు.. ఇదీ ప్రస్తుతం మధిర మున్సిపాలిటీ కేంద్రంలోని పరిస్థితి. అయితే, ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన మల్లు భట్టి విక్రమార్కకు కీలకమైన ఉపముఖ్యమంత్రి పదవితో పాటు ఆర్థిక శాఖ దక్కడంతో పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు.

ప్రస్తుతం ఇలా...

మధిర పట్టణ వైశాల్యం 31.74 చదరపు కిలోమీటర్లుగా ఉండగా.. 22 వార్డులకుగాను 11,538కుటుంబాలు, 40,468మంది జనాభా నివసిస్తున్నారు. పట్టణ వ్యాప్తంగా రోజుకు 10 మెట్రిక్ టన్నుల పొడి చెత్త, 20 మెట్రిక్ టన్నుల తడి చెత్త వెలువడుతుందని అంచనా. అయితే, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడానికి కార్మికులు, వాహనాలు చాలా కాలనీలకు వెళ్లక పేరుకుపోతోంది.

డంప్ యార్డు ఉన్నా...

పట్టణంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి కంపోస్టు ఎరువుగా మార్చేందుకు మడుపల్లి సమీపాన రూ.లక్షల వ్యయంతో షెడ్లు నిర్మించారు. కానీ ఇవి చెరువుకు సమీపాన ఉండడంతో వర్షాకాలంలో నీరు చేరుతోంది. అంతేకాక పట్టణానికి దూరంగా ఉండడంతో పారిశుద్ధ్య కార్మికులు, ఆటోడ్రైవర్లు అంత దూరం వెళ్లలేక జిలుగుమాడు సమీపాన, హనుమాన్ కాలనీకి వెళ్లే దారి, మధిర- విజయవాడ ప్రధాన రహదారి పక్కన, మధిర – నందిగామ రోడ్డు పక్కన పడేస్తున్నారు. రోడ్లకిరువైపులా వేసిన చెత్తతో దుర్వాసన వస్తుండగా.. తరచూ చెత్తకు నిప్పంటుకుని పొగ కమ్ముకుంటోంది.

ఛిద్రమైన రహదారులు

మిషన్ భగీరథ పైప్‌లైన్ల ఏర్పాటు సమయాన ఎక్కడికక్కడ సిమెంట్ రోడ్లను ధ్వంసం చేశారు. అలాగే, పట్టణంలో డ్రెయిన్లు, కల్వర్టులు సక్రమంగా లేకపోవడంతో ఇళ్లలో వాడిన నీరు, వర్షపు నీరు రోడ్డుపైకి చేరుతుంది. ఏళ్ల క్రితం నిర్మించిన డ్రెయినేజీలు కుచించుకుపోయి మురుగునీరు ముందుకు సాగడంలేదు. ఖాళీ ప్లాట్లలోకి చేరుతున్న మురుగునీటితో దోమల బెడద పెరుగుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.



ఇటీవల వర్షానికి ప్రధాన రహదారిపై నిలిచిన వరద



రాయపట్నం రోడ్డులో ప్రధాన రహదారి వెంట చెత్త

భట్టి ప్రత్యేక చొరవతో...

డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించగానే భట్టి విక్రమార్క మధిర అభివృద్ధిపై దృష్టి సారించారు. అన్ని పార్టీల నాయకులకు సమాచారం ఇచ్చి అఖిలపక్షంగా ఏర్పడి కావాల్సిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. దీంతో నాయకులు పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్డు ఆవశ్యకతను వివరించడంతో అన్ని గ్రామాలకు లింకు రోడ్లు, పట్టణంలో రహదారుల విస్తరణపై ప్రతిపాదనలు సమర్పించారు. దీంతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.128 కోట్ల నిధులు మంజూరు చేశారు. అంతేకాక మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం 25 కిలోమీటర్ల మేరకు సీసీ రోడ్లు, రెండు కి.మీ. మేర బీటీ రోడ్లు, 48 కి.మీ. వరకు మెటల్ రోడ్లు, 40 కిలోమీటర్ల వరకు మట్టి రోడ్లు ఉన్నాయి. అలాగే, 22 కిలోమీటర్ల మేర డ్రెయిన్లు ఉన్నా మరో 34 కి.మీ. వరకు నిర్మించాల్సి ఉంది. తొలుత అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించి, ఆ తర్వాత సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. అంతేకాక పట్టణానికి రెండు వైపులా డంప్ యార్డులు ఏర్పాటుచేసి ఏ రోజుకారోజు చెత్త తరలిస్తే మధిర రూపురేఖలు మారతాయని ప్రజలు భావిస్తున్నారు.

భట్టి సూచనలతో ప్రణాళిక



ప్రస్తుతం మున్సిపాలిటీలో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. వీటన్నింటినీ పరిష్కరించేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచనలతో అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇప్పటికే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.128 కోట్లు మంజూరు చేశారు.

– కోనా ధనికుమార్, మున్సిపల్ కౌన్సిలర్, మధిర

పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలి



ప్రధానంగా పారిశుద్ధ్య సమస్య వేధిస్తోంది. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దుర్వాసన వస్తుండగా జనావాసాల్లో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. సరైన రీతిలో డ్రెయిన్లు, కల్వర్టులు లేవు. తొలుత రోడ్లు, డ్రెయిన్లు నిర్మించి ప్రతీరోజు ఇంటింటా చెత్త సేకరించాలి.

– అబ్దుల్ భక్షి, ఉద్యోగి, మధిర

నిర్వహణ మెరుగుపడేలా...



పట్టణంలో ప్రతిరోజు ఉదయాన్నే పర్యటిస్తూ పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడేలా సిబ్బందికి సూచనలు చేస్తున్నాం. ఎక్కడా చెత్త పేరుకుపోకుండా యార్డుకు తరలిస్తున్నాం. ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేసి పట్టణాభివృద్ధికి వినియోగించేలా ప్రణాళిక సిద్ధమైంది.

– అహ్మద్ షఫీ ఉల్లా, మున్సిపల్ కమిషనర్, మధిర

క్లుప్తంగా

20న రైతు అవగాహన సదస్సు

నేలకొండపల్లి: నేలకొండపల్లిలో ఈనెల 20న రైతు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొన్నగాని శ్రీనివాస్, తెల్లగొర్ల లింగస్వామి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడుతూ వ్యవసాయం సాగులో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించేందుకు సదస్సు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. నేలకొండపల్లిలోని వాసవీ భవన్‌లో జరిగే సదస్సుకు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు హాజరై సాగులో మెళకువలు వివరించనున్నందున రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు గంజికుంట్ల వెంకన్న, యలమద్ది లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల బామ్మకు పుట్టినరోజు వేడుకలు



వేడుకల్లో నర్సమ్మతో కుటుంబీకులు

కూసుమంచి: వందేళ్లు పూర్తిచేసుకున్న బామ్మ పుట్టినరోజు వేడుకలను ఆమె వంద మంది కుటుంబసభ్యులు ఘనంగా జరిపించారు. మండలంలోని ముత్యాలగూడెంకు చెందిన కుక్క నర్సమ్మకు ఐదుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరి పిల్లలతో కలిపి వందమంది కుటుంబంగా ఎదిగారు. ఈక్రమంలో నర్సమ్మ వందో పుట్టిన రోజు వేడుకను గ్రామంలోని మామిడి తోటలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా నర్సమ్మతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. తనకు వందేళ్లు వచ్చినా ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, కుటుంబమే తన బలమని ఈ సందర్భంగా ఆమె వెల్లడించింది.

సీతారామపురంలో చోరీ

పెనుబల్లి: మండలంలోని సీతారామపురంలో ఓ కుటుంబీకులు ఆరు బయట నిద్రిస్తుండగా దుండగులు ఇంట్లోకి చొరబడి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. సీతారామపురానికి వేమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి శనివారం రాత్రి తన ఇంటి తలుపులకు గడియపెట్టి కుటుంబ సభ్యులంతా ఆరుబయట నిద్రించారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువా పగలగొట్టి లాకర్‌లో దాచిన సుమారు 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.70 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

విద్యుత్ మోటార్లలో కాపర్ వైర్..

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఆదివారం రాత్రి పలువురు రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్ల కాపర్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామానికి చెందిన గాదె నర్వోత్తమరెడ్డి, మాధవరెడ్డి, చలమారెడ్డి, సీతారాములు, కిషోర్‌బాబు పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్ల ధ్వంసం చేసిన దుండగులు కాపర్ వైరు ఎత్తుకెళ్లారు. రెండు రోజుల క్రితమే మోటమర్రిలో ఎత్తిపోతల పథకం మోటార్, స్టాటర్, కాపర్ వైర్ చోరీ చేయగా, చిరునోముల రెవెన్యూ పరిధిలో రిటైర్డ్ ఎస్పీ వెంకటేశ్వరావు పొలంలోనూ రెండు మోటార్ల కాపర్ వైరు చోరీ చేశారు. వ్యవసాయ సీజన్ సమీపించిన నేపథ్యాన వరుస చోరీలు జరుగుతుండడంతో పోలీసులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

రూ.లక్షల్లో కొల్లగొడుతున్నారు...

జిల్లాలో కోరలు చాస్తున్న సైబర్ భూతం

- సాంకేతిక పరిజ్ఞానంతో నేరగాళ్ల ఆటలు
- నానాటికీ పెరుగుతున్న బాధితుల సంఖ్య
- జిల్లాలో రెండేళ్లలో 196 కేసులు నమోదు



● స్వయం ఉపాధి కోసం ఖమ్మంకు చెందిన డ్రైవర్ సెకండ్ హ్యాండ్ కారు కోసం ఆరా తీస్తుండగా యాప్ ద్వారా ఓ వ్యక్తి లైన్‌లోకి వచ్చాడు. తన స్వస్థలం భద్రాచలం అని, ఆర్మీలో పనిచేస్తున్న తాను కారు తీసుకుని ఖమ్మం వస్తాయనని చెప్పడమే కాక రూ.10లక్షల కారు రూ.5లక్షలకే ఇస్తానని చెప్పాడు. తొలుత రూ.20వేలు ఆతర్వాత దఫదఫాలుగా రూ.లక్షల వరకు పంపించినా మళ్లీ అడగడంతో అనుమానం వచ్చి ఇంకో వ్యక్తితో ఫోన్ చేస్తే అవతలి వ్యక్తి ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. దీంతో పోలీసులను ఆశ్రయించగా అది సైబర్ నేరగాడి మోసమని తేల్చారు.

● ఖమ్మంకు చెందిన ఓ విద్యావంతుడైన వ్యక్తి శీతల పానీయం కంపెనీ తీసిన డ్రాలో రూ.5కోట్ల లాటరీ తగిలిందని గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసాడు. హిందీ, ఇంగ్లిష్‌లో మాట్లాడగా.. ఖమ్మం వాసి అడిగిన ప్రశ్నలన్నింటికీ తడబడకుండా సమాధానాలు ఇవ్వడంతో నమ్మాడు. తన అకౌంట్ నంబర్, ఐఎఫ్ఎస్సీ కోడ్ చెప్పాక కొద్దిగంటల్లోనే డబ్బు జమ అవుతుందని ఎదుటి వ్యక్తి చెప్పాడు. అందుకోసం ఎదురుచూస్తుండగానే తన అకౌంట్ నుంచి రూ.2లక్షలు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా ముంబైలో డబ్బు డ్రాచేసినట్లు తేలింది.

ఖమ్మంక్రైం: జిల్లాలో సైబర్ మోసాల బారిన పడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. అవగాహన ఉన్నవారు పోలీసులను నేరుగా.. ఆన్‌లైన్‌లో ఆశ్రయిస్తున్నారు. మిగతా వారు తక్కువ మొత్తం నష్టపోవడంతో ఏం చేయాలో తెలియక.. ఫిర్యాదు చేసినా డబ్బు వస్తుందన్న నమ్మకం లేక వదిలేస్తున్నారు. ఇలాంటి వారినే ఆసరాగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్ల పేట్రేగిపోతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో నేరగాళ్లు వినూత్న పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. కాస్త ఏమరుపాటుగా ఉన్నా సరే డబ్బు నష్టపోవడం బాధితుల వంతవుతోంది.

డ్రాలు, బహుమతులు రుణాల పేరిట

ప్రముఖ కంపెనీల పేరు చెబుతూ లక్కీ డ్రా బహుమతికి ఎంపికయ్యారంటూ ఇటీవల చాలా మందికి ఫోన్లు వస్తున్నాయి. అంతేకాక ఎలాంటి పత్రాలు సమర్పించకుండానే రుణం ఇస్తామని మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఇలాంటి ఫోన్లకు స్పందించినా.. మెసేజ్‌లో వచ్చే లింక్ తెరిచినా నష్టపోయే అవకాశముంది. ఆపై మోసగాళ్లు ఫోన్ చేసి అచ్చం బ్యాంకులు, కంపెనీల అధికారుల మాదిరి మాట్లాడి బ్యాంకు ఖాతాలు, పిన్ నంబర్లు, ఐఎఫ్ఎస్సీ కోడ్ తెలుసుకుని డబ్బు లాగేస్తున్నారు. ఇది జరిగిన వెంటనే గుర్తించి పోలీసులను ఆశ్రయిస్తే కొంత మేర ఫలితం ఉంటోంది. మిగతా వారు ఖాతా వివరాలు కొన్నాళ్లకు చూసుకుంటే కనక అప్పటికే డబ్బు డ్రా చేసి ఉండడంతో చేసేదేం లేక వదిలేయాల్సి వస్తుందని చెబుతున్నారు.

ఫొటోల మార్ఫింగ్.. బ్లాక్ మెయిల్

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ ఖాతాల్లో చురుగ్గా ఉండే మహిళల ఫొటోలను సేకరించి అశ్లీలంగా మార్ఫింగ్ చేసి పంపిస్తున్నట్లు కూడా ఫిర్యాదులు వస్తున్నాయి. అడిగినంతన డబ్బు ఇవ్వకపోతే ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తామని బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నారు. కొందరు డబ్బు ఇచ్చిన బెదిరింపులకు ఆగకపోవడంతో కుమిలిపోతున్నారు. ఇలాంటి పరిస్థితి ఖమ్మంలో ఓ మహిళకు ఎదురుగా నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేయగా బ్లాక్ మెయిల్‌కుదిగిన వారు రాజస్థాన్ వాసులుగా తేలింది. అంతేకాక కొందరు కస్టమ్స్ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నట్లు చెబుతూ డ్రగ్స్ వ్యాపారం చేస్తున్నారని బెదిరిస్తున్నారని సమాచారం. మళ్లీ కాసేపటికి ఫోన్ చేసి కేసు లేకుండా చూసుకుంటామని చెబుతూ రూ.50వేలు, రూ.లక్ష ఇలా అడిగిన వరకు లాగేసుకుంటున్నారు.

విస్తృత అవగాహన

ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అడ్డుకునేలా పోలీసులు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. బ్యాంకు అధికారులు ఎట్టి పరిస్థితుల్లో ఫోన్ ద్వారా వివరాలు అడగరని చెబుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి హిందీ, ఇంగ్లిష్‌లో మాట్లాడి బ్యాంకు అకౌంట్, ఇతర వివరాలు ఆరా తీస్తే చెప్పొద్దని సైబర్ క్రైం పోలీసులు సూచిస్తున్నారు. ఇలా అప్రమత్తంగా ఉండడంతో పాటు మోసానికి గురైనట్లు భావిస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో కానీ సైబర్ సెల్ టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పిస్తున్నారు.

కేసులు భారీగానే...

జిల్లాలో గత ఏడాది 2023లో సైబర్ మోసాలకు సంబంధించి పోలీసులకు 868 ఫిర్యాదులు అందాయి. ఇందులో 162 ఘటనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇక ఈ ఏడాది ఇప్పటికే 54 ఫిర్యాదులు అందగా.. సైబర్ పోలీసులు 34కేసులపై ఎఫ్ఐఆర్ చేశారు.

రాజస్థాన్ రాష్ట్రమే అడ్డా?

రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్ కేంద్రంగా ఎక్కువ మంది సైబర్ నేరగాళ్లు ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు సైబర్ పోలీసులు విచారణలో వెల్లడినట్లు సమాచారం. అయితే వారిని పట్టుకోవడానికి అక్కడకు వెళ్లాలంటే పోలీసులు రిస్క్ తీసుకోవాల్సి ఉంటుంది. తీరా వెళ్లినా చేతికి చిక్కుతారన్న నమ్మకం ఉండదు. అంతేకాక అక్కడి స్థానికులెవరూ పోలీసులకు సహకరించే పరిస్థితి ఉండదని సమాచారం. ఫలితంగా ఎక్కువ శాతం ఇలాంటి కేసుల్లో విచారణ చివరి వరకు కొనసాగడం లేదని తెలుస్తోంది.

డిప్యూటీ సీఎంకు ఎస్‌టీఎఫ్ నాయకుల సన్మానం



డిప్యూటీ సీఎం భట్టిని సన్మానిస్తున్న ఎస్‌టీఎఫ్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పండిట్, పీఈటీల సమస్యలను పరిష్కరించడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఎస్‌టీఎఫ్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఖమ్మంలో సోమవారం ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు ఆధ్వర్యాన కలిసి సన్మానించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పండిట్, పీఈటీలకు పదోన్నతులు కల్పించడంతో సుమారు 20వేల మందికి పదోన్నతులు లభించాయని తెలిపారు. విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేయడంలో భాగంగా మార్పులకు శ్రీకారం చుట్టామని, ప్రతీ మండలానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గండు యాదగిరి, మన్సూర్, నాయకులు వెంకన్న, శ్రీనివాసరావు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) సమావేశం

ఖమ్మం సహకారనగర్: టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, కల్లోజు శ్రీనివాస్, షఫీ తెలిపారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో ఉదయం 10గంటలకు మొదలయ్యే సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్, ఉపాధ్యక్షుడు రమేష్ హజారే, సంయుక్త కార్యదర్శి మేకల కల్యాణ్‌చక్రవర్తి, కోశాధికారి పి.యోగానంద్, టెంజూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.విష్ణువర్ధన్‌రెడ్డి, ఏ.రమణకుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. వివిధ అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్న నేపథ్యాన జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మహిళలు, చిన్నారులకు అండగా 'అంకుర'



మాట్లాడుతున్న డాక్టర్ రాకేశ్, పక్కన వైద్యులు

ఖమ్మంవైద్యవిభాగం: మహిళలకే కాక చిన్నారుల చికిత్స విషయంలో మెరుగైన సేవలందిస్తున్న ఖమ్మంలోని అంకుర ఆస్పత్రి మరో ముందడుగు వేస్తోందని ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ చల్లగుళ్ల రాకేష్ వెల్లడించారు. అంకుర ఆస్పత్రిని ఖమ్మం సీక్వెల్ రోడ్డులోని గొరిల్లా పార్కు ఎదురుగా నూతన భవనంలోని మార్చిన సందర్భంగానే కాక డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక రాయితీలు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవించే వరకు చేయాల్సిన పరీక్షలన్నింటినీ మెటర్నిటీ ప్యాకేజీగా అందుబాటులోకి తీసుకొచ్చి రాయితీ ఇస్తున్నట్టు వెల్లడించారు. అందులోనే వెల్ బేబీ పేరిట శిశువు జన్మించాక ఒకసారి ఉచిత కన్సల్టేషన్, వ్యాక్సిన్లు, పరీక్షల్లో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇక 'ఉమెన్ వెల్‌నెస్' పేరుతో మూడు రకాల ప్యాకేజీలు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఇందులో వయస్సుల వారీగా మహిళలకు అవసరమైన పరీక్షలపై రాయితీ ఉంటుందని, కొత్తగా పెళ్లయిన జంటలకు సైతం పరీక్షల్లో రాయితీలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందుకోసం జూలై 31లోగా రిజిస్టర్ చేయించుకుంటే ఏడాదిలో ఎప్పుడైనా పరీక్ష చేయంచుకోవచ్చని రాకేష్ వివరించారు. ఈ సమావేశంలో ఆస్పత్రి వైద్యులు శ్వేత యుదిస్టిర్, నీలకుర్తి జ్యోత్స్న, బొప్పుడి కల్పన, కందుకూరి సాయిప్రసన్న పాల్గొన్నారు.

మధిరలో పీవైఎల్ రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్


మధిర: వచ్చేనెల 13, 14వ తేదీల్లో మధిరలో ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి అజయ్ తెలిపారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వాలు ప్రజలు, యువతకు అలవికాని వాగ్దానాలను ఇచ్చారని తెలి పారు. దేశంలో 40 కోట్ల మంది, రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక దుర్భర జీవితం గడుపుతున్నారని చెప్పారు. అయినా ఏళ్ల తరబడి పాలకులు వీరిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇక నీట్ పేపర్ల లీకేజీతో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారినందున నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా, వచ్చేనెల 13, 14వ తేదీల్లో జరిగే శిక్షణ తరగతుల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతినిధులు హాజరుకానుండగా.. యువత సమస్యలు, భవిష్యత్‌పై చర్చించి పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. వీ.రాకేష్, జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్, నాయకులు సురేష్, సేవాలాల్, దేవా తదితరులు పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన ఆర్ఎంపీ

ఆపై గుండెపోటుగా చిత్రీకరించే యత్నం

ఖమ్మంక్రైం: రెండో భార్యను దారుణంగా కడతేర్చాడో ఓ ఆర్ఎంపీ. అంతేకాక గుండెపోటుతో మృతి చెందిందని చిత్రీకరించడానికి ప్రయత్నించినా పోలీసుల విచారణతో ఆయన పన్నాగం బెడిసికొట్టింది. ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ వెల్లడించిన వివరాలు.. ఖమ్మం వికలాంగుల కాలనీలో ఆర్ఎంపీగా ప్రాక్టీస్ చేస్తున్న బుర్రా మల్లయ్యకు తొలుత శైలజతో వివాహమైంది. ఇద్దరు పిల్లలు పుట్టాక కొంతకాలం క్రితం ఆమె కనిపించకుండా వెళ్లిపోవడంతో నేలకొండపల్లి మండలం భైరవునిపల్లికి చెందిన కళావతి(32)ని రెండో వివాహం చేసుకున్నాడు. అయితే, వీరికి ఓ కుమార్తె జన్మించాక మొదటి భార్య శైలజ తిరిగి వచ్చింది. అప్పటి వరకు విడాకులు ఇవ్వకపోవటంతో పెద్దలు పంచాయితీ నిర్వహించి మళ్లీ కాపురానికి పంపించారు. దీంతో రెండేళ్ల నుంచి ఒకే భవనంలోని రెండంతస్తుల్లో ఇద్దరు భార్యలతో మల్లయ్య జీవిస్తున్నాడు. అయితే, ఇటీవల వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం మొదటి భార్య శైలజ పిల్లలతో కలిసి బెంగళూరులోని బంధువుల ఇంటికి వెళ్లగా.. చిన్న భార్య కళావతి తన 12ఏళ్ల కుమార్తెను ఆదివారం అమ్మమ్మ ఇంటికి పంపించింది. ఈమేరకు ఇంటి వద్ద మల్లయ్య, కళావతి మాత్రమే ఉండడంతో సోమవారం తెల్లవారుజామున ఆమె అడ్డు తొలగించాలనే భావనతో హత్య చేశాడు. ఆపై తాను వాకింగ్‌కు వెళ్లొసరికి కళావతికి గుండెపోటు వచ్చిందని ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందిందని ఆమె కుటుంబసభ్యులు, బంధువులకు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు చేరుకుని పరిశీలిస్తే ఆమె మెడ, ముఖంపై గాయాలు ఉండడంతో నిలదీయగా పొంతన లేని సమాధానాలు ఇవ్వగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు చేరుకుని మల్లయ్యను విచారించగా ఆదివారం రాత్రి తనకు, కళావతికి ఆస్తి విషయమై ఘర్షణ జరగడంతో గొంతు నులిమి హత్య చేసినట్లు అంగీకరించాడు. ఘటనపై ఆమె తల్లి నాగేంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వంతెనపై కమ్మేసిన పొగ



లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారులు

వైరారూరల్: చలికాలం కమ్ముకునే మంచు మాదిరి ఈ దృశ్యం కనిపిస్తున్నా చెత్తకుప్పలకు అంటుకున్న మంటతో వ్యాపించిన పొగ ఇది. వైరా మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను సిబ్బంది మండలంలోని స్టేజీ పినపాక హైలెవల్ వంతెన కింద వేశారు. ఈ చెత్తకు సోమవారం తెల్లవారుజామున నిప్పంటుకోవడంతో పొగ వంతెనను కమ్మేయగా వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది.


పోలీస్ పెట్రోకార్ తగిలి ముగ్గురికి తీవ్రగాయాలు

ఖమ్మంక్రైం: పోలీసుల పెట్రోకార్ తాకడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం రాత్రి ఖమ్మంలో జరిగింది. అగ్రహారం కాలనీ కొత్తూరుకు చెందిన ముగ్గురు ఇటీవల వారి తండ్రి మృతి చెందడంతో ఆదివారం రాత్రి కురవిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయం వద్ద నిద్ర చేసేందుకు బైక్‌పై బయలుదేరారు. ముస్తఫానగర్ సమీపాన మిషన్ ఆస్పత్రి వద్ద ఎదురుగా వచ్చిన పోలీస్ పెట్రోకార్ తగిలి కింద పడగా వీరికి తీవ్రగాయాలయ్యాయి. అయితే, ఆ సమయాన పెట్రోకార్ నడిపిస్తున్న కానిస్టేబుల్ మద్యం తాగి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా కొత్తూరు వాసులు ముగ్గురు ఒకే బైక్‌పై అతివేగంగా వచ్చి పెట్రోకార్‌కు తాకారని తెలిపారు. అంతేతప్ప తమ డ్రైవర్ మద్యం తాగిలేదని స్పష్టం చేశారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని తెలిపారు.

మధిరలో బైక్ చోరీ

మధిర: మధిరలోని పాత పెట్రోల్ బంక్‌లో పార్క్ చేసి ఉన్న బైక్ ఆదివారం రాత్రి చోరీకి గురైంది. స్థానిక వ్యాపారి కాజా కిరణ్‌కుమార్ తన ద్విచక్ర వాహనాన్ని బంకక్‌లో పార్క్ చేసి ఊరికి వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చేసరికి వాహనం లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

కారు ఢీకొని యువకుడు మృతి



శ్రీను (ఫైల్)

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు గ్రామ సమీపాన సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన మండవ శ్రీను (20) బైక్‌పై ఇంటికి వెళుతుండగా జీళ్లచెరువు సమీపాన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనును స్థానికులు 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

పుట్టినరోజు విందు ఇస్తామని పిలిచి దాడి

బోనకల్: పుట్టిన రోజు వేడుకకు ఆహ్వానించిన ఓ యువకుడిని చితకబాదిన ఘటన మండలంలోని రావినూతలలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జొన్నలగడ్డ గోపి పుట్టినరోజు సందర్భంగా ఈనెల 14న ఆయన స్నేహితులైన జొన్నలగడ్డ పవన్, రేగళ్ల గోపి, గణపారపు గోపి పార్టీ ఇస్తామని బోనకల్‌లోని వైన్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ మాటామాటా పెరిగి తోపులాట జరిగింది. ఈక్రమాన గోపి ఇంటికి వెళ్తుండగా ఆయన స్నేహితులు ముగ్గురు రావినూతల పాతకాల వద్ద కాపుకాసి తీవ్రంగా కొట్టారు. దీంతో గాయపడిన గోపిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా ఆయన తండ్రి కొండలు ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుబాబు తెలిపారు.